ప్రజాశక్తి
గురువారం 22 మే 2025
5
పార్వతీపురం మన్యం

అందుబాటులోకి ఎండోస్కోపీ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఏరియా ఆసుపత్రిలో బుధవారం ఇఎన్‌టి విభాగంలో ఎండోస్కోపి విభాగాన్ని సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా రోగులు దీన్ని వినియోగించుకోవాలని చెప్పారు. జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇఎన్‌టి సంబంధించి చికిత్సలు అందిస్తామని తెలిపారు. దీన్ని రోగులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఎన్‌టి వైద్య నిపుణులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో సాలూరు

- ఆగ్రహంతో ఊగిపోతున్న జనం
- ధర్నాలు, రాస్తారోకోలతో ఆందోళన
- ట్రాన్స్‌కో ఎడిఇ నిర్బంధం, విడుదల
- ఒకటి, రెండు వీధుల్లో తప్ప కోతల్లేవన్న మంత్రి

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఇలాకాలో గత మూడు రోజులుగా అంధకారం రాజ్యమేలుతోంది. విద్యుత్ శాఖ వైఫల్యం కారణంగా శ్యామలాంబ పండగ మూడు రోజుల గా కరెంట్ లేక ప్రజలు విలవిల్లాడుతున్నారు. బుధవారం నాటికీ విద్యుత్ సరఫరా లేకపోవడంతో జనం కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో ఊగిపోతూ రోడ్లపై కి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. ట్రాన్స్ కో ఎడిఇ రంగారావును అల్లువీధి రామమందిరం లో స్థానికులు నిర్బంధించారు. బోసుబొమ్మ జంక్షన్‌లో విద్యుత్ సరఫరా కోసం ప్రజలు రాస్తారోకో చేపట్టారు. సిపిఎం నాయకులు ఎన్వై నాయుడు ఆందోళన కు మద్దతు పలికారు. ఒకవైపు పట్టణ ప్రజలు విద్యుత్ కోతలతో అల్లాడుతుంటే మంత్రి సంధ్యారాణి బుకాయింపులకు దిగారు. ఒకటి, రెండు వీధుల్లో తప్ప పెద్దగా విద్యుత్ సరఫరాలో ఇబ్బందుల్లేవని, శ్రమించిన ట్రాన్స్ కో అధికారులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రకటన విడుదల చేశారు.

ప్రజాశక్తి - సాలూరు

శ్యామలాంబ పండుగ నేపథ్యంలో పట్టణంలో నిరంతర సరఫరా కోసం విద్యుత్ శాఖ చేపట్టిన చర్యలు బెడిసి కొట్టాయి. అధికారుల అంచనాలు తారుమారయ్యాయి. పండుగ మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో ఆటంకం లేకుండా చేయడానికి ట్రాన్స్ కో అధికారులు చేపట్టిన చర్యలు ఫలితాన్నివ్వలేదు. ఫలితంగా పట్టణ ప్రజలు తీవ్ర స్థాయిలో కరెంటు కోతలు ఎదుర్కొన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులను, స్నేహితులను ఇళ్లల్లో ఉంచలేక నానా అగచాట్లు పడ్డారు. పండగకు వచ్చే జనాభా రీత్యా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలంటే ఎంత సామర్థ్యం కలిగిన ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేయాలో, ఎంతమంది సిబ్బందిని అందుబాటులో ఉంచాలో అంచనా వేయడంలో ట్రాన్స్‌కో అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. సోమ, మంగళ, బుధవారాల్లో పూర్తిగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో జనం పూర్తిగా జనరేటర్లపై ఆధారపడ్డారు. ఆర్థిక స్థోమత కలిగిన కుటుంబాలకు చెందిన వారు పండగలో ఎదురయ్యే ఇబ్బందులను ఊహించి జనరేటర్లను ముందుగానే బుక్ చేసుకున్నారు. పట్టణమంతా సుమారు 800జనరేటర్ల వరకు మూడు రోజుల పాటు ప్రజలు వినియోగించారనే వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో జరిగిన శ్యామలాంబ పండుగ సందర్భంగా ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకొని అనేకమంది జనరేటర్లను బుక్ చేసుకోవడంతో కొంతవరకు ఉపశమనం పొందగలిగారు. ఎక్కువ మంది పేద, మధ్యతరగతి ప్రజలు ట్రాన్స్‌కో సరఫరా పైనే ఆశలు పెట్టుకున్నారు. మూడురోజుల్లోనూ విద్యుత్ కోతల కారణంగా సామాన్య ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నిరంతర విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో విద్యుత్ కష్టాలు వర్ణనాతీతమయ్యాయి. జరిగిన అంతరాయాలను వెంటనే సరిదిద్దే సిబ్బంది కూడా అందుబాటులో లేకపోవడం, అధికారులు కూడా సకాలంలో స్పందించకపోవడంతో పట్టణ వాసులు నానా అవస్థలు పడ్డారు. మంగళవారం సిరిమానోత్సవం పూర్తయ్యేసరికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేస్తారని ప్రజలు భావించారు. కానీ అలా జరగలేదు. బుధవారం రాత్రి వరకు సరఫరా పునరుద్ధరణ చేయలేని దుస్థితిలో ట్రాన్స్‌కో అధికారులు ఉన్నారు. పండగ సందర్భంగా విద్యుత్ సరఫరా నిర్వహణలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారని పట్టణ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పండగ రెండు నెలల ముందు నుంచి విద్యుత్ సరఫరా, ఇతర సౌకర్యాల కల్పన కోసం సన్నాహక సమావేశాలు నిర్వహించినా ఫలితం కనిపించలేదు.

ధర్నా చేసిన కుమ్మరి వీధి, నాయుడువీధి, అల్లువీధి ప్రజలు

బుధవారం రాత్రికి కూడా విద్యుత్ సరఫరా జరగకపోవడంతో పట్టణంలోని చిన కుమ్మరి వీధి, నాయుడువీధి, అల్లువీధి ప్రజలు కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో ఊగిపోయారు. ఈ వీధులకు చెందిన కొంతమంది యువకులు మెయిన్ రోడ్డు మీద కొచ్చి ధర్నా నిర్వహించారు. చినకుమ్మరివాసుల ఆందోళనతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. పట్టణ సిఐ అప్పలనాయుడు ధర్నా ప్రదేశానికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.

పట్టణంలో స్తంభించిన ట్రాఫిక్

పలు చోట్ల స్తంభించిన ట్రాఫిక్

శ్యామలాంబ పండుగ నేపథ్యంలో పట్టణంలో బుధవారం చాలా చోట్ల ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. కార్లు, ద్విచక్ర వాహనదారులు నానా అగచాట్లు పడ్డారు. పండగ ముగించుకుని సొంత గ్రామాలకు, పట్టణాలకు బయలు దేరిన సమయంలో చాలా అవస్థలు పడ్డారు. శివాజీ బొమ్మ జంక్షన్, బోసు బొమ్మ జంక్షన్, మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ జరిగింది. బైపాస్ జంక్షన్ నుంచి కొట్టక్కి వరకు జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. తిరుగు ప్రయాణంలో ఒకేసారి ఆర్టీసీ బస్సులు, కార్లు, ద్విచక్ర వాహనాల్లో జనం బయలుదేరడంతో ట్రాఫిక్ జామ్ జరిగింది. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం వేకువజాము 3 గంటల వరకు సిరిమానోత్సవంలో బందోబస్తు ఏర్పాట్లు చేసిన పోలీసులు బుధవారం నాటికి బాగా అలసిపోయారు. దీంతో బుధవారం ఉదయం నుంచి ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేసే సిబ్బంది కరువయ్యారు. డబ్బివీధి, దండిగాం రోడ్డుల్లో గంటలకొద్దీ ట్రాఫిక్ జామ్ జరగడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

ఉత్సవ కమిటీ తీరుపై అసంతృప్తి

శ్యామలాంబ పండుగ ఉత్సవ కమిటీ తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనుభవం లేని వ్యక్తి ని ఉత్సవ కమిటీ చైర్మన్‌గా నియమించడం వల్లే ఆశించిన స్థాయిలో విజయవంతం కాలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. మంత్రి సంధ్యారాణికి సన్నిహిత అనుచరుడైన కారణంగానే అక్కేన అప్పారావును కమిటీ చైర్మన్ చేసినట్లు తెలుస్తోంది. వాస్తవంగా శ్యామలాంబ పండగ నిర్వహణపై విశేష అనుభవం ఉన్న నాయకులు, వ్యక్తులు పట్టణంలో ఉన్నారు. వారందరినీ కాదని ఏకపక్షంగా కమిటీ చైర్మన్ పేరును ప్రకటించడంపై మొదట్లో అనేకమంది అసంతృప్తి వ్యక్తం చేశారు. కమిటీలో వందలామంది సభ్యులు ఉన్నప్పటికీ కేవలం ముగ్గురు వ్యక్తుల కనుసన్నల్లోనే చందాలు వసూలు, ఖర్చులన్నీ జరిగినట్లు తెలుస్తోంది. ఈ ముగ్గురు కమిటీ సభ్యులు కూడా మంత్రి సంధ్యారాణి నియంత్రణలో పని చేయడం చర్చనీయాంశమవుతోంది. రాజకీయాలకు అతీతంగా ఏర్పాటు కావాల్సిన పండగ కమిటీని మంత్రి సంధ్యారాణి తన చెప్పుచేతల్లో ఉండే వ్యక్తులతో ఏర్పాటు చేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సిరిమానోత్సవంలో అంజలి రథం విరిగిపోయిన సంఘటన పై ప్రజల్లో రకరకాల చర్చలు జరుగుతున్నాయి. అంజలిరథం పటిష్టతను అంచనా వేయడంలో కమిటీ సభ్యులు తగిన జాగ్రత్తలు తీసుకోలేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

మంత్రి వార్డులోనూ ఇదే పరిస్థితి

సాక్షాత్తూ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి నివాసం ఉంటున్న 23వ వార్డు ప్రజలు కూడా తీవ్రమైన విద్యుత్ కోతలు, తాగునీటి కష్టాలు ఎదుర్కొన్నారు. అదే వార్డులో ఉన్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర, మంత్రి సంధ్యారాణి నివాసాలకు నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్న ట్రాన్స్ కో అధికారులు ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను పట్టించుకోలేదు. దీంతో రామా కాలనీలో ఉన్న చాలా మంది పేద, మధ్యతరగతి కుటుంబాలు మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్వై నాయుడు కాలనీ వాసుల కష్టాలు తెలుసుకుని వారితో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ మంత్రి సంధ్యారాణి, మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర నివాసం ఉంటున్న వార్డులో వారికి నిరంతర సరఫరా చేసిన అధికారులు ప్రజలకు ఎందుకు ఇబ్బంది లేకుండా చేయలేకపోయారని ప్రశ్నించారు. పండగ నేపథ్యంలో జనాభా అవసరాలకు సరిపడే ఏర్పాట్లు చేయడంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం స్పష్టం గా కనిపించిందని చెప్పారు.

రోడ్ షో తో సిరిమాను సంబరానికి మంత్రి

మంగళవారం జరిగిన సిరిమానోత్సవానికి హాజరైన మంత్రి సంధ్యారాణి టాప్ లేని కారులో వస్తూ జనసందోహానికి అభివాదం చేశారు. వాస్తవంగా సిరిమాను రథం ఊరేగింపు సాయంత్రం 4.05 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. మంత్రి సాయంత్రం 5.30 గంటలకు రావడంతో సిరిమాను సంబరం ఆలస్యంగా ప్రారంభమైంది. రాత్రి 12 గంటల్లో గా సిరిమాను సంబరం ముగించాల్సి వున్నప్పటికీ అంజలిరథం చక్రం విరిగిపోవడంతో బోసు బొమ్మ జంక్షన్ సమీపాన నిలిపివేశారు. మరో చక్రం తీసుకొచ్చి అమర్చిన తర్వాత సిరిమానోత్సవం ప్రారంభం కావడంతో ముగింపు బాగా ఆలస్యమైంది. ఏది ఏమైనా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయడంతో సంబరం ముగిసింది.

బోసు బొమ్మ వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున మహిళలు

తక్షణమే విద్యుత్ పునరుద్ధరించాలి : సిపిఎం

జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే విద్యుత్ పునరుద్ధరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. విద్యుత్ లేకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం రాత్రి ప్రజలు ఎక్కడికి అక్కడ ప్రజలు మెయిన్ రోడ్‌పైకి స్వచ్ఛందంగా వచ్చి రోడ్లు దిగ్బంధం చేయడమంటే ప్రజల సమస్యల్ని పాలకులు నిర్లక్ష్యం చేయడమేనన్నారు. నిరసన తెలియజేస్తున్న సాలూరు ప్రజలకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలిపారు. కలెక్టర్ యుద్ధ ప్రాతిపదికన జిల్లా అధికారులతో సమీక్షించి విద్యుత్ పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతవరకూ అవసరమైతే బయట ప్రాంతాల నుంచి ప్రజలకు మంచినీరు, వాడుక నీరు అందుబాటులో ట్యాంకులు రూపంలో ఇవ్వాలని కోరారు.

అల్లువీధి రామమందిరంలో నిర్బంధంలో ఉన్న ఎడిఇ రంగారావు

ఎడిఇ రంగారావును నిర్బంధించిన ప్రజలు

గత మూడు రోజులుగా పట్టణంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో ఊగిపోతున్నారు. బుధవారం సాయంత్రం వరకూ సరఫరా లేకపోవడంతో అల్లువీధి, నాయుడు వీధి ప్రజలు ట్రాన్స్‌కో ఎడిఇ వి.రంగారావును అల్లువీధి రామమందిరంలో పెట్టి నిర్బంధించారు. ఉక్కపోతలతో సతమతమవుతున్న జనం ఇళ్లల్లో వుండలేక రోడ్డు మీద కొచ్చి ధర్నా నిర్వహించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కోసం అల్లు వీధి వైపు జీపులో వచ్చిన ఎడిఇ రంగారావును చుట్టుముట్టి రామమందిరంలో నిర్బంధించి తాళం వేశారు. రామమందిరం వద్ద పోలీసులు కాపలా కాస్తున్నారు. అనంతరం పట్టణ సిఐ ప్రజలకు నచ్చజెప్పి ఎడిఇను విడుదల చేశారు.

కూలీ కుటుంబానికి రూ.25లక్షలు పరిహారమివ్వాలి

- గాయపడిన వారికి రూ.లక్ష చొప్పున సాయం అందించాలి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగు నాయుడు డిమాండ్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గడగమ్మకు చెందిన ఉపాధి కూలీ అరసాడ ప్రసాదరావు ఈనెల 16న ఉపాధి పనికి వెళ్లిఆటోలో తిరిగి వస్తుండగా చినగోర కాలనీకి సమీపాన ఆటో తిరగబడి మృతి చెందాడు. ఈ కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.25లక్షల నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయనతో పాటు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు నారాయణపురం సింహాచలం మృతుడి కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా గంగు నాయుడు మాట్లాడుతూ గడగమ్మ నుంచి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న చినగోర కాలనీ గ్రామ సమీపాన ఉపాధి పని కల్పించడం వల్ల అక్కడికి గడగమ్మ నుంచి 150 మంది ఉపాధి కూలీలు ప్రతిరోజూ రానూ పోనూ వంద రూపాయలు ఆటో ఛార్జీ కట్టుకొని ఆటోలపైన వెళ్లి వస్తున్నారన్నారు. ఇది చాలా దుర్మార్గమన్నారు. అంత దూరం ఆటోపై ప్రయాణించి పని చేసుకుని రావడం వల్ల పెద్దూరు-సింధునగర్ గిరిజన గ్రామాల మధ్య ఈనెల 16న ఆటో అదుపుతప్పి బోల్తాపడిన సంఘటనలో అరసాడ ప్రసాదరావు మృతి చెందాడని, కావున ఆయన కుటుంబానికి రూ.25లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఆటో ప్రమాదంలో పట్టా సంతోషమ్మ, అరసాడ ప్రేమమ్మ, దయానందం, ఏసు రత్నం తీవ్రంగా గాయపడ్డారని, వారు గత వారం రోజుల నుంచి పని చేసుకోలేక గ్రామంలోనే వారి ఇళ్ల వద్ద మంచం పట్టి ఉన్నారని, వీరికి ఎటువంటి ఆర్థిక, వైద్య సహాయం అందలేదని అన్నారు. ఇప్పటికైనా ఉపాధి అధికారులు స్పందించి మృతి చెందిన ప్రసాదరావు కుటుంబానికి క్లైం పంపించి వెంటనే రూ.25లక్షలు నష్టపరిహారం వచ్చేలా చూడాలని, అలాగే గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే 15 కిలోమీటర్ల దూరం కాకుండా గడగమ్మ గ్రామానికి నాలుగు కిలోమీటర్ల పరిధిలో ఉన్న దళితులకు, పేదలకు ఉపాధి పనులు కల్పించాలని, లేనిపక్షంలో ఉపాధి కూలీలందరితో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న గంగునాయుడు

మినీ మహానాడులో రసాభాస

కాసేపు తర్వాత మళ్లీ ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొండ

నియోజకవర్గ స్థాయిలోని స్థానిక సిఎల్ నాయుడు కల్యాణ మండపంలో బుధవారం జరిగిన మినీ మహానాడు రసాభసాగా మారింది. కార్యక్రమం ప్రారంభం నుంచి టిడిపి చెందిన కొంతమంది కార్యకర్తలు గందరగోళం సృష్టించారు. జెండా పట్టుకుని కష్టపడిన తమకు గుర్తింపు లేదంటూ గట్టిగా కేకలు వేశారు. పార్టీకి వ్యతిరేకంగా పని చేసేవారికి అందలం ఎక్కిస్తున్నారని నిలదీశారు. వైసిపికి ఓట్లు వేయించినవారిని వేదికలపై కూర్చోపెట్టడం అన్యాయమంటూ కార్యకర్తలు కేకలు వేశారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. దీంతో కొంతసేపు రసాభాసగా మారింది. పోలీసులు అక్కడ చేరుకొని గొడవ చేసిన వారిని చెదరగొట్టారు. అయితే మళ్లీ వారు అక్కడికి చేరుకొని జైకళా అంటూ నినాదాలు చేసి గందరగోళం వాతావరణం సృష్టించారు. టిడిపిలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వరా అంటూ నిలదీస్తూ కార్యక్రమంలో గందరగోళ వాతావరణం సృష్టించారు. దీంతో అక్కడున్న అరకు పార్లమెంటు పరిశీలకులు హర్షవర్ధన్, నియోజకవర్గ పరిశీలకులు కలమటి సాగర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో కొద్దిసేపు కార్యక్రమం వాయిదా పడింది. మళ్లీ కార్యక్రమం నిర్వహించి పరిశీలకులు హర్షవర్ధన్ మాట్లాడుతూ ఇక్కడ పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. కార్యకర్తలు ఇక్కడ క్రమశిక్షణగా ఉన్నారని, నాయకుల్లో సమన్వయం లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఎదురవుతుందని అన్నారు. ఇక్కడకు రావాలంటే భయమేస్తుందన్నారు. నియోజకవర్గ పరిశీలకులుగా మార్చాలని సాగర్ పార్టీ అధిష్టానం దృష్టికి వెళ్లారంటే ఇక్కడ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాలన్నారు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి మాట్లాడుతూ సంక్షేమానికి తెలుగుదేశం కట్టుబడి ఉందన్నారు. కడపలో ఈనెల 27న జరిగే మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కె.అప్పలనాయుడు మాట్లాడుతూ ఇక్కడ జరిగిన పరిణామాలు బాధాకరంగా ఉన్నాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో వీరఘట్టం మాజీ జడ్పిటిసి సభ్యులు గేదెల రమేష్, కె.వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షులు గడ్డి రామినాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షులు గంట సంతోష్ కుమార్, గుమ్మడి సింహాద్రి, భూపతిరావు, మజ్జి జయశంకర్ తదితరులు ఉన్నారు

నాయకులను నిలదీస్తున్న కార్యకర్తలు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, కావున ప్రజలంతా భాగస్వాములు కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపు నిచ్చారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో ఆయుష్, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా యోగాంధ్ర మాసోత్సవ కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్థానిక ఆర్‌సిఎం ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని పచ్చ జెండా ఊపి యోగాంధ్రా ర్యాలీని ప్రారంభించారు. ఆర్‌సిఎం ప్రభుత్వ కార్యాలయాల సముదాయం నుంచి కలెక్టరేట్ వరకు కొనసాగింది. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా అధికారులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని యోగాసనాలను చేశారు. ఈ సందర్భంగా యోగాంధ్ర పోస్టరును, యాప్‌ను ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించిన కలెక్టర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నెల రోజుల ముందు నుంచే గ్రామ, మండల స్థాయిలో యోగా కార్యక్రమాలను నిర్వహించి యోగాంధ్రకు రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చిందని అన్నారు. నెల రోజుల పాటు జరిగే ఈ మాసోత్సవ కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, కావున ప్రతి ఒక్కరూ యోగాపై దృష్టి సారించి ఫిట్ ఇండియా, ఫిట్ ఆంధ్ర ఉద్యమంలా యోగాను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. ప్రతి ఒక్కరూ యోగాంధ్ర యాప్‌ను డౌన్ లోడ్ చేసుకొని తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెసి ఎస్-ఎస్ శోబిక, ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, డిఆర్ఒ కె.హేమలత, జిల్లా ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ బి.సుశీల, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎం.వినోద్‌కుమార్, డాక్టర్ టి.జగన్మోహనరావు, మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, ఆయుష్, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ అధికారులు, యోగా శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

యోగా ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ఎన్‌ఎంఇపి కార్మికులను కొనసాగించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

జాతీయ మలేరియా నిర్మూలన కార్యక్రమంలో పని చేస్తున్న కార్మికులను కొనసాగించాలని కోరుతూ డిఆర్వో కె.హేమలతకు సిఐటియు ఆధ్వర్యాన బుధవారం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, నాయకులు సాంబయ్య, మాట్లాడుతూ గత 20 ఏళ్ల నుంచి సీతంపేట మండలంలో ఎన్‌ఎంఇపి, సబ్ యూనిట్ పరిధిలో (డిడిటి) దోమల మందు స్ప్రేయింగ్ వర్క్ చేస్తున్న సుమారు 41 మందిని పాతవారితో పని చేయించాలని డిమాండ్ చేశారు. మర్రిపాడు డోన్ బైపిహెచ్ పరిధిలో ఆ గ్రామాల్లో సదరు డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు 20ఏళ్ల నుంచి పనిచేస్తున్న కార్మికులతో కాకుండా కొత్త వారితో పని చేయించడం తగదన్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ పనిని నమ్ముకుని జీవిస్తున్న వారి ఉపాధి పోతుందని చెప్పారు. సీతంపేట సబ్ యూనిట్ ఆఫీసర్ కొత్త వారితో పని చేయించి, మరో 20 మంది టీముగా పాత వారితో పనిచేయడం న్యాయం కాదని చెప్పారు. కావున పనిచేస్తున్న పాత వారందరితో పని చేయించాలని, వాళ్లకు ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డిఆర్‌ఒకు వినతిని అందజేస్తున్న ఎన్‌ఎంఇపి కార్మికులు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

లేఅవుట్ రికార్డులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

ఆ భూములకు కన్వర్జేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి - కొమరాడ

వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్‌గా చేస్తే తప్పనిసరిగా కన్వర్జేషన్ చేసుకోవాలని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ అన్నారు. కొమరాడలో పలువురు పెట్టుకున్న ల్యాండ్ కన్వర్షన్ భూములను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూములను రియల్ ఎస్టేట్‌గా వివిధ అవసరాల కోసం వ్యాపారీత్యా చేసుకునేందుకు తప్పనిసరిగా ల్యాండ్ కన్వర్షన్ చేసుకోవాలని సూచించారు. అక్కడున్న విధివిధానాలకు అనుకూలంగా వ్యవసాయ భూములను మార్పు చేసి అమ్మకాలకు, అవసరాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన తర్వాతే పనులు చేసుకోవాలన్నారు. మండల కేంద్రంలో గురుకుల బాలుర పాఠశాల సమీపాన ల్యాండ్ కన్వర్షన్‌కు దరఖాస్తు చేసుకున్న వారి భూములను పరిశీలించి హద్దులను, వివరాలను స్థానిక రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కన్వర్షన్ పెట్టుకునే సమయంలో ఎటువంటి తప్పులు జరగకుండా సక్రమంగా గుర్తించి పక్క భూమి ఉన్న రైతులకు సమాచారం ఇచ్చి వారి రికార్డుల్లో ఉన్న భూమిని కొలతలు వేసి పరిశీలించాలని స్పష్టం చేశారు. కన్వర్జేషన్ సమయంలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుములు చెల్లించిన అనంతరం పరిశీలనకు వచ్చి అక్కడ రికార్డులను పరిశీలించి పరిసరాలను పరిశీలించిన తర్వాత ప్రభుత్వం అనుమతులు అందజేస్తామని తెలిపారు. పరిశీలనలో తహాశీల్దార్ సాయి కామేశ్వరరావు, మండల సర్వేయర్ వంశీకృష్ణ, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి :పిఒ

ప్రజాశక్తి - భామిని

పిఎం జన్మన్ ద్వారా మంజూరైన గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని తాలాడలో గల తాటిమానుగూడ గ్రామాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపడుతున్న గృహ నిర్మాణాలను పరిశీలించి, నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా ఇప్పటి వరకు నిర్మించిన గృహాలకు బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పాలిష్ కోటలో వనతల్లి విడివికె కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఈ కేంద్రం ద్వారా తయారు చేస్తున్న ఉత్పత్తులను పరిశీలించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం కాత్రగడలో చేపడుతున్న జలజీవన్ మిషన్ పనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిఎం చక్రపాణి, ఇఒపిఆర్‌డి కృష్ణారావు ఉన్నారు.

కస్పా వీధిలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని రెండో సచివాలయం పరిధిలో గల కస్పా వీధిలో స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, గర్భిణీలు, చిన్నారులు, మధుమేహ, రక్తపోటు తదితర రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, రోగులు, పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తరచుగా గ్రామాలు సందర్శించి పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వీటిని దృష్టిలో పెట్టుకొని పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామస్తుల నుంచి ఫిర్యాదు రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఒ డి.వెంకటరమణ, మేజర్ పంచాయతీ ఇఒ బి.కోటేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతుకు విత్తనాలు అందజేస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

గిరిజన రైతులకు విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం, సీతంపేట గిరిజన అభివృద్ధి సంస్థ సంయుక్తంగా అల్లంలో అధిక దిగుబడినిచ్చే మహిమ రకం విత్తనాలను కెవికె ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వి.హరికుమార్ గిరిజన రైతులకు బుధవారం అందజేశారు. సీతంపేట, హిరమండలం, కొత్తూరు మండలాల్లో అల్లం పండిస్తున్న రైతులకు భూతలగూడ, దిసరిగూడ, గొట్టిపల్లి, అడ్డంగి, చాపరాయిగూడ వంటి గిరిజన శిఖరాగ్ర గ్రామాల్లోని రైతులకు ఈ విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ పంట సాగు వివరాలు, ఆవశ్యతను ప్రాజెక్ట్ హార్టికల్చర్ ఆఫీసర్ ఎస్ వెంకట్ గణేష్ రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి అయంతి కుమారి అల్లం పంట ఆవశ్యకతను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వెలుగు ఎన్‌జిఒ ఆనంద్, రైతులు పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

అగ్ని ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని చినగుడబలో జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు పెంకిటిళ్లు అగ్నికి ఆహుతైన విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బాధితులను బుధవారం పరామర్శించారు. బాధితులైన ముడిల కళావతి, సరస్వతి, భాస్కరరావు ఇళ్లను పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాద బాధితులకు బియ్యం, చీరలు, ఆర్థిక సహాయాన్ని అందించారు. ప్రభుత్వపరంగా సహాయం చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మర్రాపు పురుషోత్తమనాయుడు, మరడాన తవిటినాయుడు, శంకరరావు, జనసేన మండల అధ్యక్షులు బోను శివ, అక్కేన శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కర్మయోగి పోర్టల్లో లాగిన్ అవ్వాలి

ప్రజాశక్తి - సీతానగరం

కర్మయోగి పోర్టల్ లాగిన్‌లో పంచాయతీ కార్యదర్శులంతా లాగిన్ అవ్వాలని డిఐపిఒ నాగభూషణరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. జూన్ 21న యోగా దినోత్సవం సందర్భంగా కర్మయోగి కోట్లల్లో సాంకేతిక నైపుణ్యాన్ని పొందాలన్నారు. ప్రతి ఇంటి లబ్ధిదారుల ఆధార్ అప్డేషను చేయాలన్నారు. ప్రతి పంచాయతీలను యోగా దినోత్సవం నిర్వహించాలని ముందుగా అందరికీ ఈ కార్యక్రమం పట్ల అవగాహన కలిగించాలని అన్నారు. సమావేశంలో ఎంపిడిఒ ఎంఎస్ఎన్ ప్రసాద్, ఇఒపిఆర్‌డి కె.కుమార్ వర్మ, వివిధ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న డిఐపిఒ నాగభూషణరావు

ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతుసంఘం నాయకులు, రైతులు

28న ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - పాలకొండ

తోటపల్లి ఎడమ కాలువ భూములకు సాగునీరందించాలని కోరుతూ ఈనెల 28న సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్నట్లు ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు అన్నారు. ఈ మేరకు ధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను మండలంలోని బాసురులో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక శ్రీ కోట దుర్గ ఆలయం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ ప్రదర్శన, అనంతరం అక్కడ జరుగుతుందన్నారు. తోటపల్లి బ్యారేజ్ ఎడమ కాలువ ద్వారా మండలంలో సుమారు 25 గ్రామాలకు సాగునీరందడం లేదన్నారు. కొన్ని ప్రాంతాలకు మొదటి పంటకు కూడా నీరందడం లేదన్నారు. రెండో పంటకు నీరందేలా చర్యలు చేపట్టాలన్నారు. తోటపల్లి ఆయకట్టు రైతులు మే 6న సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చినప్పటికీ నేటికీ అధికార యంత్రాంగంలో కదిలి లేదన్నారు. దీంతో ఈనెల 28లోపు తోటపల్లి ఎడమ కాలువ ఆయకొట్టు రైతులకు సాగునీరు అందించే చర్యలు నిర్దిష్టమైన ప్రతిపాదనలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాజకీయాలకు అతీతంగా ఈనెల 28న రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరుగుతుందన్నారు. కావున ఈ ధర్నాకు రైతులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బెజపురం, బాసురు ఆయకట్టు రైతులు కిమిడి బంగార్ నాయుడు, వంజరాపు లచ్చునాయుడు, బొంతు బంగారు నాయుడు, మజ్జి గణ, పొట్నూరు శ్రీను, గిరిజాల రమణ, తదితరులు రైతులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో

జంఝావతి సాధన సమితి ఏర్పాటు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జంఝావతి సాధన సమితి నూతన కార్యవర్గం

దశాబ్దాలుగా రైతులను ఊరిస్తున్న జంఝావతి పూర్తిస్థాయి ప్రాజెక్టు సాధన కోసం జంఝావతి సాధన సమితి ఏర్పాటైంది. బుధవారం స్థానిక ఎపి ఎన్జీవో హోంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిశర్ల మాలతీ కృష్ణమూర్తి నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జంఝావతి సాధన సమితిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ డి.పారినాయుడు, అధ్యక్షులుగా చుక్క భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా పల్లి రాజగోపాలనాయుడు, ఉపాధ్యక్షులుగా ఈర్ల సంజీవనాయుడు, చుక్క చంద్రరావు, కొల్లి సింహాచలం, మాన్యం రామకృష్ణ, మంత్రపూడి వెంకటరమణలు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు, సవరపు రామారావు, పాలక రంజిత్‌కుమార్, ఇవి నాయుడు, కార్యదర్శులుగా సిగడం భాస్కరరావు, తీళ్ళ గౌరీశంకరరావు, నెల్లి లక్ష్మునాయుడు, అట్టాడ రవికుమార్, ప్రచార కమిటీ కన్వీనర్లుగా వి.శ్రీహరి, మేడిశెట్టి రామచంద్రారావు, వలిరెడ్డి కృష్ణ, రాజాన చిన్నం నాయుడు, బలగ శంకరరావు, వావిలపల్లి విశ్వనాథం, కార్యాచరణ కన్వీనర్‌గా మరిశర్ల మాలతీ కృష్ణమూర్తి నాయుడు, కో కన్వీనర్‌గా జాగారపు ఈశ్వర ప్రసాద్, గవిరెడ్డి రఘు సత్య సింహ చక్రవర్తి, వంగలి దాలినాయుడు, చీఫ్ అడ్వైజర్లుగా పివికె మణికుమార్, జగన్నాథ ప్రసాద్, రాయగురు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన జంఝావతి సాధన సమితి ప్రతినిధులు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటుతనానికి, వలసలు పెరగడానికి జంఝావతి ప్రాజెక్టు పూర్తి కాకపోవడమే అన్నారు. జంఝావతి పూర్తిస్థాయిలో సాగునీరందిస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధి ఖాయమన్నారు. రాష్ట్రంలోనూ, ఒడిశాలోనూ, కేంద్రంలో అనుకూల ప్రభుత్వాలు ఉండడంతో జంఝావతి సమస్య తీరుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. జంఝావతి పూర్తిస్థాయి ప్రాజెక్ట్ సాధన కోసం కృషి చేస్తామన్నారు. త్వరలో కార్యాచరణ రూపొందించి, ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు, పలువురు రైతులు, జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన పెద్దలు దేవుపల్లి సీతారాం పట్నాయక్, బొమ్మను పార్వతీశం, జి.జగన్నాథం నాయుడు, బి.నారాయణమూర్తి, బి. రాజారావు, రెడ్డి అప్పలనాయుడు, జి.అప్పలరాజు, తవిటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలి రూ.600 ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి - పాలకొండ

ఉపాధివేతనదారులనుద్దేశించి మాట్లాడుతున్న వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు ఈశ్వరరావు

ఉపాధి కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, రెండు పూటలా పని రద్దు చేయాలని, ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని రోజు కూలి రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రెడ్డి ఈశ్వరరావు, కొల్లి గంగు నాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని వెలగవాడలో బుధవారం ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఉపాధి కూలీలకు గతంలో టెంట్లు, మెడికల్ కిట్లు, మంచినీరు మజ్జిగ ఇచ్చేవారని, అలాగే మేట్లకు ప్రోత్సాహం ఐదు రూపాయలు ఇచ్చేవారని అన్నారు. గతంలో ఒక్కపూట పని చేయించేవారని, ఇప్పుడు బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొత్తం మౌలిక సదుపాయాలను రద్దు చేశారని, ఒక్క పూట పని రెండు పూటలా పెంచారని, దీనికి మూలం ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసి ఎత్తివేయడానికి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. దేశంలో మొత్తం జాబ్ కార్డు ఉన్నవారికి పని కల్పించాలంటే రూ.2,50,000 కోట్ల నిధులు మంజూరు చేయాలన్నారు. కానీ రూ.80వేల కోట్లు మాత్రమే మంజూరు చేశారని తెలిపారు. ఇప్పటికే రూ.25 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని అన్నారు. ఉపాధిహామీ చట్టాన్ని కూలీలు విసిగిపోయేలా చేయించి ఎత్తివేయడానికి ప్రభుత్వం కుట్రపన్నుతోందని విమర్శించారు. కావున కూలీలంతా పోరాడి రెండుపూటలా పని రద్దు చేయించుకోవాలని, ఏడాది 200 రోజులు పని దినాలు సాధించాలని, రోజుకూలీ రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి దుర్గారావు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

నవధాన్యాల సాగు.. నేల తల్లికి బహు బాగు

ప్రజాశక్తి - కురుపాం

నవధాన్యాల సాగుతో నేల తల్లికి బహు బాబుగా ఉండి రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న రైతులకు కురుపాంలో గల రైతు సేవా కేంద్రంలో బుధవారం నవధాన్యాల కిట్ల పంపిణీకి ముఖ్యఅతిథిగా పాల్గొని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే వారు పండించే భూములు పూర్తిస్థాయిలో సారవంతంగా ఉండేందుకు 20 నుంచి 30 రకాల విత్తనాల మిశ్రమం నవధాన్యాలను ఒక ఎకరాకు 15 నుంచి 25 కేజీలు వేసుకోవాలని, ఏ విధమైన రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా ప్రధాన పంటలకు అవసరమయ్యే అన్ని రకాల సూక్ష్మ, స్థూల పోషకాలు సవృద్ధిగా లభిస్తాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించే ఆహార ఉత్పత్తులు వినియోగించడం వల్ల బిపి, షుగరు, క్యాన్సరు, రక్తహీనత, మొదలగు వ్యాధులు రాకుండా కాపాడుకోగలుగుతారన్నారు. అందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కావున ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయాన్ని సాగు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కొండయ్య, ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి, ఇఒపిఆర్‌డి వెంకటనాయుడు, ఎపిఎం బి.వెంకట్, ఎన్ఎఫ్ఎ సిబ్బంది జి.అన్నపూర్ణ, దేవీప్రసాద్, బి.శ్రీరామ్, శ్రీనివాసరావు, విహెచ్ఎలు మౌనిక, నరేష్ గంగాధర్ ప్రకతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జూన్ 21 వరకు యోగాంధ్ర : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లావ్యాప్తంగా ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్రా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ బుధవారం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. మే 21 నుంచి 27 వరకు తొలివారం రోజులు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా క్యాంపెయిన్ ప్రారంభోత్సవంతో పాటు మే 22 నుంచి 27 వరకు యోగాపై శిక్షణ పొందిన వారితో మాస్టర్ ట్రైనీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. మే 28న ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, తహశీల్దార్లు పాల్గొనేలా మండల స్థాయి కార్యక్రమం ఉంటుందని అన్నారు. జూన్ 2న రంగోలి (ముగ్గులు పోటీలు) ఉంటుందని, 4న ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల సమన్వయంతో అన్ని గ్రామ, వార్డు, మున్సిపల్ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ ఉంటుందని తెలిపారు. జూన్ 5 నుంచి 7 వరకు స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ కార్యక్రమం ప్రారంభం, జూన్ 16న కుటుంబ సభ్యులంతా యోగాలో పాల్గొనేలా చేయడం (3,4 తరాలకు చెందిన కుటుంబ సభ్యులతో సహా), 17న సీనియర్ సిటీజన్లతో యోగా, 18,19 తేదీల్లో 75 ఏళ్లు నిండిన వారు యోగాలో పాల్గొనేలా ప్రోత్సాహించడం, ప్రతి స్థాయిలో బాగా యోగా చేసిన వారికి బహుమతి ప్రధానం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. 17 నుంచి 20 వరకు యోగా పోర్టల్ నందు నమోదు చేసుకున్న వారి వివరాలు, ప్రతిస్పందన సేకరణ, 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు. నెల రోజుల పాటు గ్రామ, వార్డు, మండల, జిల్లాస్థాయిలో జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర వర్గాల వారు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ప్రతి ఒక్కరూ వెబ్ సైట్ నందు తమ పేర్లు నమోదుచేసుకొని పాల్గొనాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

ప్రజా సమస్యలు పరిష్కారమే అజెండా

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడమే తన అజెండా అని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు వినతుల రూపంలో అందించిన సమస్యలను పరిశీలించి వాటిలో తక్షణమే పరిష్కరించాల్సినవి, అక్కడికక్కడే పరిష్కార మార్గాన్ని చూపారు. మరికొన్ని సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పూర్తి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు.

పోల్ట్రీ వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

పౌల్ట్రీ వ్యాన్ మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఒడిషా రాష్ట్రం అలమండ పంచాయతీ జగ్గుగూడ గ్రామానికి చెందిన కద్రక నారు (45) మోటార్ సైకిల్ పై పార్వతీపురం మండలం రంగాలగూడలోని ఒక వివాహ కార్యక్రమానికి తన కుటుంబ సభ్యులు కద్రక అనంత్, కద్రక అర్జుతో కలిసి వచ్చి తిరిగి జగ్గుగూడ వెళ్తుండగా రంగాలగూడ శివార్లో గల మలుపు తిరుగుతుండగా ఎదురుగా వస్తున్న పౌల్ట్రీ వ్యాన్ ఢీకొంది. ఈసంఘటనలో నారు, అనంత్, అర్జులకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించి పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. నారు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

ప్రజలకు తాగునీరందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - కొమరాడ

గ్రామంలో ప్రజల అవసరాల మేరకు తాగునీటి సదుపాయం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం సంతోషకరమని టిడిపి సీనియర్ నాయకులు బురిడి కాళీ అన్నారు. మండలంలోని కోటిపాం పంచాయతీ దేవునిగుంపలో బుధవారం జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా బోరు కోసం కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పంచాయతీల అభివృద్ధికి కనీసం ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో పంచాయతీలు పూర్తిగా అభివృద్ధి జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీలకు అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. ముఖ్యంగా ప్రజలకు అవసరమైన తాగునీరు అందించడం ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి 24 గంటలు నీరందించడం ప్రభుత్వ గొప్పదనమని అన్నారు. కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఒక్క పూటే ఉపాధి పనులు నిర్వహించాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

ఉపాధి హామీ పనులు ఒక్కపూట మాత్రమే నిర్వహించేలా ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని వేతనదారులు డిమాండ్ చేశారు. స్థానిక చిన్నమ్మతల్లి గుడి వద్ద పని ప్రదేశంలో సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండు పూటల పనులు పెట్టడం వల్ల పడుతున్న ఇబ్బందులు తెలుపుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు పూటల పని వల్ల కూలీలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఎండ తీవ్రంగా ఉండడంవల్ల వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. రెండు పూటలా పనిచేసినా సక్రమంగా బిల్లులు పడే పరిస్థితి లేదనీ ఉపాధి కూలీలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో తాగునీరు, మజ్జిగ ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. అలవెన్సులు మంజూరు చేసి, గిట్టుబాటు కూలీ రూ.307 ఇవ్వాలని, అందరికీ జాబ్ కార్డులు జారీ చేయాలని, బకాయి ఉన్న ఉపాధి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

విపత్తులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

విపత్తులపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో బుధవారం అగ్నిమాపక అధికారి జె.సర్వేశ్వరరావు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎప్పటికప్పుడు వాతావరణం గమనిస్తూ పిడుగులు పడే అవకాశం, అంచనా ఉన్న సురక్షిత ప్రదేశంలో వేచి ఉండాలని చెప్పారు. ప్రయాణాలు చేయరాదని అలాగే పిడుగులు పడే సమయంలో నేలపైన చెవులు మూసుకుని పడుకోవడమైనా, కూర్చోవడమైనా చేయాలని కోరారు. ఆరుబయట, చెట్లు కింద ఉండరాదని సూచనలు ఇచ్చారు. వివిధ రకాల అగ్ని ప్రమాదాలను నిర్మూలించే పద్ధతులను తెలిపారు. విషవాయువులు పీల్చి స్పృహ కోల్పోయిన వ్యక్తులకు అందించే కృత్రిమ శ్వాస పద్ధతులను, ప్రమాదాల్లో గాయపడిన వారిని సురక్షిత ప్రదేశానికి తరలించే పద్ధతులపై తర్ఫీదు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ, ట్రైనింగ్ ఆఫీసర్ వి.రఘురాం, డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్ ఆర్.ప్రేమ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంపై ఆగ్రహం

ప్రజాశక్తి - బొబ్బిలి

పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంపై మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని కుమ్మరివీధి సచివాలయం పరిధిలోని పారిశుధ్య పనులను బుధవారం పరిశీలించారు. రోడ్లపై చెత్త, కాలువలలో పూడికలు ఉండడంతో వార్డు సచివాలయ శానిటేషన్ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై ఉన్న చెత్తను, కాలువలలో పూడికలు తొలగించాలని ఆదేశించారు. మురుగునీరు సక్రమంగా ప్రవహించేలా చూడాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెతో శానిటేషన్ సిబ్బంది ఉన్నారు.

కష్టపడి చదివితేనే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి - బొబ్బిలి

కష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. బొబ్బిలి నియోజకవర్గంలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి, ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి బాగా చదువుకోవాలని కోరారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంస పత్రాలు, మెమెంటోలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కొప్పలవెలమ సంక్షేమ సంఘం నాయకులు బి.సాయికృష్ణ, ఎల్.జగన్నాధం, జి.వెంకటనాయుడు, పి.స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి దూరంగా 'సామంతుల'

ప్రజాశక్తి - పాలకొండ

నియోజకవర్గంలో కీలక నేతగా ముద్ర పడిన మాజీ జెడ్పిటిసి సభ్యులు సామంతుల దామోదరరావు కొద్ది రోజుల నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటున్నట్లు తెలుస్తుంది. తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మినీ మహానాడు కార్యక్రమానికి కూడా ఆయన హాజరు కాకపోవడం చర్చనీయాంశమవుతుంది. గత రెండుసార్లు టిడిపి కార్యక్రమాలకు ఆయన హాజరు కాలేదు. దీంతో ఆయన దూరంగా ఉంటున్నట్లు పార్టీ కార్యకర్తల్లో చర్చ మొదలైంది. జిల్లా ఇన్చార్జ్ మంత్రి అచ్చెన్నాయుడుతో మంచి సత్సంబంధాలు ఉన్న నేతగా ముద్ర పడిన సామంతుల పార్టీకి ఇటీవల కొద్ది రోజుల నుంచి దూరంగా ఉంటున్నారు. కూటమి ఎమ్మెల్యేతో విభేదాలు ఉన్నప్పటికీ ఇన్చార్జితో కలిసి పని చేసిన ఆయన పార్టీ కార్యక్రమాలకు రాకపోవడంతో పలు అనుమానాలు అందరిలోని వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల నామినేటెడ్ పదవుల పంపకాల్లో ప్రాధాన్యత లేకపోవడంతో పాటు పార్టీ సభ్యత్వాలు చేసిన వారికి కార్డులు కూడా ఇన్చార్జి ఇవ్వకపోవడంతో ఆయన అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైఖరి పట్ల అసంతృప్తిగా ఉన్నట్లు ఆయన వర్గీయులు చెప్తున్నారు.

ఇంటింటికీ రేషన్ రద్దు ఆలోచన మానుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఇప్పటి వరకు వాహనం ద్వారా ఇంటింటికీ రేషన్ ఇచ్చే విధానం రద్దు ఆలోచన మానుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రంజిత్‌కుమార్ బుధవారం పార్వతీపురంలో మాట్లాడుతూ గిరిజన కొండకోన, మారుమూల గ్రామాల వారికి ఎంతగానో ఉపయోగపడిన వాహనం ద్వారా ఇంటింటికీ రేషన్ ఇచ్చే ప్రస్తుత విధానం రద్దు చేసి జూన్ నుంచి రేషన్ షాప్‌కు వెళ్లి సరుకులు తెచ్చుకొనే విధానం తీసుకుని రావడం ఆశాస్త్రీయమైన ఆలోచన అని రంజిత్ కుమార్ అన్నారు. గిరిజనులకు ఇది ఇబ్బందులకు గురిచేసే ఆలోచన అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం మాను కోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం కార్యక్రమంలో భాగంగా బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. అదే విధంగా విద్యార్థులకు కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లీష్, ఇంగ్లీష్, తెలుగు గ్రామర్, క్విజ్ పోటీలు, నిర్వహించినట్టు శాఖా గ్రంథాలయ నిర్వాహకులు నల్ల మధుసూదనరావు తెలిపారు.